www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
05 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 277

# విశాలభారతి

తెలుగు దినపత్రిక



## స్థానిక సంస్థల ఎన్నికలపై ట్విస్ట్

### రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు

- నిర్వహణపై న్యాయపరమైన వివాదం
- తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు
- సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలు
- ఎన్నికల ప్రక్రియపై ఉత్కంఠ
- రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై న్యాయపరమైన వివాదం కొనసాగుతోంది. ఈ ఎన్నికలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ.. ఓ వ్యక్తి సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. ఇది రాష్ట్రంలో రాబోయే ఎన్నికల ప్రక్రియపై ఉత్కంఠను పెంచింది.తెలంగాణలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై వంగ గోపాల్ రెడ్డి అనే వ్యక్తి సెప్టెంబర్ 29న సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను ఈ పిటిషన్‌లో ఆయన సవాల్ చేశారు. ముఖ్యంగా రిజర్వేషన్లు మొత్తం 50 శాతం పరిమితిని దాటాయని, ఇది సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన తీర్పులకు విరుద్ధమని ఆయన పిటిషన్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం అక్టోబర్ 6వ తేదీన ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది. ఈ న్యాయపరమైన సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ.. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్థానిక ఎన్నికలకు నగారా మోగించింది. ఎంపీటీసీ (మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు), జడ్పీటీసీ (జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు), మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికలను మొత్తం ఐదు దశల్లో నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయి. మిగిలిన మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. తెలంగాణలో ఇటీవల అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల విజయం తర్వాత, గ్రామీణ స్థాయిలో తమ పట్టును నిరూపించుకోవడానికి ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు కీలకం. ముఖ్యంగా.. అధికార మార్పిడి తర్వాత సంక్షేమ పథకాల అమలును ప్రజలు ఎలా అంచనా వేస్తున్నారో తెలుసుకోవడానికి ఈ ఎన్నికలు ఒక పరీక్షగా మారనున్నాయి. మరోవైపు.. అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థలపై పూర్తి ఆధిపత్యం చెలాయించిన బీఆర్ఎస్ పార్టీ, ఈ ఎన్నికల్లో తిరిగి తమ బలం నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. బీజేపీ కూడా గ్రామీణ ప్రాంతాల్లో బలోపేతం కావడానికి ఈ ఎన్నికలను ఒక అవకాశంగా చూస్తోంది. ఈ నేపథ్యంలో.. సుప్రీంకోర్టు తీర్పు ఎన్నికల షెడ్యూల్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల్లో 42 శాతం బీసీలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం.. దీన్ని సవాల్ చేస్తూ పలువురు కోర్టును ఆశ్రయించడంపై ఉత్కంఠ నెలకొంది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీ చేసిన తీర్మానం గవర్నర్ దగ్గరే పెండింగ్‌లో ఉండగా, ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ లోపు ప్రభుత్వమే జీవో ఇవ్వాల్సిన అవసరం ఏమిటని కోర్టు ప్రశ్నించింది. ఎన్నికలకు పది రోజులు ఆగాలని ఆదేశించింది. ఈ అంశంపై తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది. దీంతో రిజర్వేషన్ల అమలుపై సస్పెన్స్ కొనసాగుతోంది. కోర్టులో కేసు ఉండగానే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు విడుతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, మూడు విడుతల్లో సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసింది. 50 శాతం కోటా క్యాప్ ఎత్తేయడాన్ని సవాల్ చేస్తూ న్యాయస్థానాల్లో పిటిషన్‌లు దాఖలు చేయడంతో.. ఈ అంశంపై న్యాయస్థానాలు ఏం చెబుతాయి..? ఎన్నికలు జరుగుతాయా.? లేదా.? అనే ఉత్కంఠ నెలకొంది.



## కొలువుల జాతర

- తెలంగాణలో కొలువుల జాతర
- ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీలు
- భర్తీకి ఇప్పటికే నిర్ణయం తీసుకుంది
- గ్రూప్-1, గ్రూప్-2 ఫలితాలు
- మిగతా విభాగాలపై దృష్టి
- 60,000 పైగా నియామకాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో కొలువుల జాతర ప్రారంభం కానుంది. ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీల భర్తీకి ఇప్పటి కే నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు వెలువడిన నోటిఫికేషన్ల నియామక ప్రక్రియ దాదాపు పూర్తి అయింది. గ్రూప్-1, గ్రూప్-2 ఫలితాలు వెలువడంతో మిగతా విభాగాలపై రాష్ట్రప్రభుత్వం దృష్టిసారించింది. ప్రభుత్వం 60,000 పైగా నియామకాలు పూర్తిచేసింది. ప్రభుత్వం ఇప్పటికే భారీ సంఖ్యలో ఉద్యోగాలను గుర్తించగా 20,000 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చింది. దీంతో.. ఇక నోటిఫికేషన్లు

మిగతా 2లో..

## పోరాడుతాం

- ఆరోగ్య రంగంలో తెలంగాణ నిర్వీర్యం
- హరీష్ రావు విరుచుకుపడ్డారు
- టిమ్స్ ఆస్పత్రి నిర్మాణం పరిశీలన
- యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- కేసీఆర్ హయాంలో ప్రారంభం
- హైద్రాబాద్ చుట్టూ టిమ్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆరోగ్య రంగంలో తెలంగాణను నిర్వీర్యం చేశారని ప్రభుత్వంపై హరీష్ రావు విరుచుకుపడ్డారు. ఎల్బీనగర్‌లో టిమ్స్ ఆస్పత్రి నిర్మాణాన్ని హరీష్ రావు పరిశీలించారు. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రుల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని .. కేసీఆర్ హయాంలో ప్రారంభమైన నిర్మాణం

మిగతా 2లో..





ఆర్‌ఆర్‌ఆర్ కోసం
రూ.45 వేల కోట్లు
02

## ఏఐలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్ తాళ్లూరి పల్లవి

02

**ప్రధాని మోడీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆరెంపుల యువతి**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రధానమంత్రి నరేంద్రమోది చేతుల మీదుగా ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన యువతి తాళ్లూరి పల్లవి అవార్డును అందుకున్నారు.ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ ప్రొగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలొ ఈ అవార్డును అందుకున్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ ,ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ. 60,000 కోట్లతో ప్రవేశపెట్టారు.దీనిలొ భాగంగానే అత్యుత్తమ నైపుణ్యం కనపరిచిన పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు.దీనిలొ భాగంగా ఆర్టిపిషియల్ ఇంటలీజెన్స్ విభాగంలొ ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్ గా ఎన్నికైన ఖమ్మం జిల్లా కి చెందిన తాళ్లూరి పల్లవికి ప్రదాని చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేసి పల్లవినీ ప్రధాని మోదీ అభినందించారు.



## మూర్ఖుడా తెలివి లేదా?

02

- తెలంగాణ సీఎం రేవంత్
- సొంత పార్టీ నేతలే విమర్శలు
- బీహార్ డీఎన్ఏ గురించి కామెంట్స్
- వివాదాస్పదంగా మారాయి
- కన్హయ్య కుమార్ సైతం టార్గెట్
- స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సీఎం రేవంత్ పైన సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. బీహార్ డీఎన్ఏ గురించి రేవంత్ చేసిన కామెంట్స్ వివాదాస్పదంగా మారాయి. ఇప్పటికే ఈ వ్యాఖ్యల పైన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఫైర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఎలా రేవంత్ ఎలా గెలుస్తారో చూస్తానంటూ సవాల్ చేసారు.ఇప్పుడు కన్హయ్య కుమార్ సైతం రేవంత్ ను టార్గెట్ చేసారు. మూర్ఖుడు అంటూ... తెలివి లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడు ఈ వివాదం కాంగ్రెస్ లో సంచలనంగా మారుతోంది. బీహార్ ఎన్నికల వేళ తెలంగాణ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు వివాదంగా మారుతున్నాయి. ఈ సారి బీహార్ లో బీజేపీని ఓడించాలని మహా ఘట్ బంధన్ తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తోంది.



### జంట జలాశయాలను పరిశీలించిన జలమండలి ఎండి

**రా జేంద్రనగర్, విశాలభారతి:** జలమండలి ఎండి అశోక్ రెడ్డి జంట జలాశయాలను శనివారం పరిశీలించారు. జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్కు వరద నీరు పోటేత్తుతోంది. 5000 క్యూసెక్కుల నీటిని అధికారులు మూసీలోకి వదులుతున్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక చేశారు. జంట జలాశయాలను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచన చేశారు. అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## భగ్గుమన్న విభేధాలు

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
- కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు
- ఢిల్లీ కేంద్రంగా కీలక పరిణామాలు
- ఎంపీ అంజన్ కుమార్ యాదవ్
- మంత్రి పొన్నం ప్రభాకర్
- స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ కాంగ్రెస్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో ఢిల్లీ కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్.. మంత్రి పొన్నం ప్రభాకర్ పై ఫైర్ అయ్యారు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రిగా వ్యవహరిస్తున్న పొన్నం ప్రభాకర్ ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బయటివారికి టిక్కెట్ కల్పించకూడదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు పట్ల పలువురు పార్టీ సీనియర్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్.. పొన్నం వ్యాఖ్యలపై స్పందించారు. పొన్నం ప్రభాకర్ కంటే తానే సీనియర్ నాయకుడు అని గుర్తు చేశారు. అదే సమయంలో జూబ్లీహిల్స్ టిక్కెట్ ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం నిర్ణయించాలని స్పష్టం చేశారు. పొన్నం ప్రభాకర్ ప్రకటనలు, టిక్కెట్ పై అధికారాన్ని స్వయంగా చూపించే ప్రయత్నం అని ఆయన విమర్శించారు. అంతే కాకుండా ఆయన కాంగ్రెస్ లోని కుటుంబాధిపత్య విధానాలను ప్రస్తావించారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి.. కోమటిరెడ్డి సోదరులు.. మల్లు భట్టివిక్రమార్క్, ఆయన అన్న మల్లు రవి.. వివేక్ మంత్రిగా, కుమారుడు ఎంపీగా, సోదరుడు ఎమ్మెల్యేగా ఉన్న విషయాలను ఉదాహరణలుగా చాటారు. ఈ పరిస్థితుల్లో తన

మిగతా 2లో..

## అమెరికాలో తెలంగాణ విద్యార్థి మృతి

- అమెకారిలో కాల్పులు కలకలం
- తెలంగాణకు విద్యార్థి మృతి
- పోలె చంద్రశేఖర్‌గా గుర్తింపు
- హైదరాబాద్‌లో నివాసం
- సీఎం రేవంత్ రెడ్డి సంతాపం
- మాజీ మంత్రి హరీష్ రావు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అమెకారిలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో తెలంగాణకు చెందిన విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. అతడిని పోలె చంద్రశేఖర్‌గా గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హైదరాబాద్‌లోని బీఎన్ రెడ్డి ఫేస్ 2 లోని టీచర్స్ కాలనీలో చంద్రశేఖర్ కుటుంబం నివాసం ఉంటుంది. చంద్రశేఖర్ 2023లో బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. డల్లాస్‌లోని నార్త్ టెక్సాస్ విశ్వవిద్యాలయంలో చదువు కొనసాగిస్తూనే... డెల్టాన్‌లోని ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పని చేస్తున్నాడు. అయితే రాత్రిపూట గ్యాస్ ఫిలింగ్ స్టేషన్‌లో పనిచేస్తున్న చంద్రశేఖర్‌పై ఒక ఆఫ్రికన్‌అమెరికన్ వ్యక్తి కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనలో చంద్రశేఖర్ అక్కడికక్కడే కుప్పకూలి మరణించాడు. ఇది ఆ ప్రాంతంలో భయాందోళనలకు దారితీసింది. మరోవైపు చంద్రశేఖర్ మరణవార్త తెలిసి అతడి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి కొడుకు ఇక లేడన్న విషయం తెలిసి చంద్రశేఖర్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చంద్రశేఖర్ మృతితో టీచర్స్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇక, చంద్రశేఖర్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది.

మిగతా 2లో..



## బీజేపీ ఫోకస్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
- త్వరలో జరిగే అవకాశాలు
- బీజేపీ దృష్టి సారించింది
- 2023లో ఘన విజయం
- సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకొనే యత్నం
- ముగ్గురు సభ్యులతో కమిటీ

02

# మూర్ఖుడా తెలివి లేదా?

(మొదటిపేజీ తరువాయి)

ఇదే సమయంలో రేవంత్ బీహార్ ప్రజల పైన చేసినట్లుగా కొన్ని వ్యాఖ్యలు ప్రచారంలోకి వచ్చాయి. వీటి పైన బీహార్ నేతలు మండిపడుతున్నారు. జన సూరజ్ పార్టీ అధినేత.. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఈ వ్యాఖ్యల పైన మండిపడ్డారు. అసలు రేవంత్ ఈ వ్యాఖ్యలు ఎలా చేస్తారని.. డీఎన్ఏ గురించి మాట్లాడే రేవంత్.. తన వద్దకు మూడు సార్లు వచ్చి సాయం ఎలా కోరారని ప్రశాంత్ కిశోర్ ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్ ఎలా గెలుస్తారో చూస్తానంటూ సవాల్ చేసారు. ఇక, తాజాగా.. కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ సైతం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేసారు. ఇలా వరుసగా రేవంత్ టార్గెట్ అవ్వటం కాంగ్రెస్ కు సమస్యగా మారుతోంది. కన్హయ్య కుమార్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో రేవంత్ కామెంట్స్ పైన స్పందించారు. ఘాటు వ్యాఖ్యలు చేసారు. రేవంత్ రెడ్డి ఒక మూర్ఖుడు అని.. తెలివితక్కువ వాడంటూ ఏకీపారేశారు. బీహార్ ప్రజలను కూలీలు అని ఎలా అంటాడని, వారి డీఎన్ఏ అంటూ కాంట్రవర్సీగా మాట్లాడటం ఏంటంటూ నిలదీసారు.



దొంగతనం చేసే వారిని దొంగలు అని అంటారు.. తెలివి లేకుండా మాట్లాడే వారిని మూర్ఖుడు అని అంటారని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి మా పార్టీ సీఎం అయినా మూర్ఖుడే అని అంటానని.. ఇందులో ఎలాంటి విచారం లేదని తేల్చి చెప్పారు. అటు బీహార్ లో ఎన్నికలు హోరా హోరీగా మారుతున్న వేళ.. సొంత పార్టీ సీఎం చేసిన వ్యాఖ్యల పైన పార్టీ నేతలు మండిపడుతున్నారు. సొంత పార్టీ నేతలే రేవంత్ ను టార్గెట్ చేస్తున్నారు. దీంతో, ఇప్పుడు కాంగ్రెస్ అధి నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుందీ.. ఎలాంటి ముగింపు ఇస్తుందనేది పార్టీ నేతల్లో ఆసక్తి కర చర్చగా మారుతోంది.

## అమెరికాలో తెలంగాణ విద్యార్థి మృతి

(మొదటిపేజీ తరువాయి)

**సీఎం రేవంత్ రెడ్డి సంతాపం...**

అమెరికాలో దుండగుల కాల్పుల్లో ఎల్బీ నగర్ కు చెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను కలిగించిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టుగా తెలిపారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్ భౌతిక కాయాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు.



**చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు**

చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరీష్‌రావు, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పరామర్శించారు. బీడీఎస్ పూర్తి చేసి, పై చదువుల కోసం అమెరికా (డల్లాస్) వెళ్ళిన ఎల్బీ నగర్ కు చెందిన దళిత విద్యార్థి చంద్ర శేఖర్ పోలే ఈరోజు తెల్లవారు జామున దుండగులు జరిపిన కాల్పులో మృతి చెందటం విషాదకరమని హరీష్ రావు అన్నారు. ఉన్నత స్థాయిలో ఉంటాడనుకున్న కొడుకు ఇక లేడు అన్న విషయం తెలిసి తల్లి దండ్రులు పడుతున్న అవేదన చూస్తే గుండె తరుక్కు పోతుందని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్టుగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని చంద్ర శేఖర్ పార్థీవ దేహాన్ని వీలైనంత త్వరగా స్వస్థలానికి తరలించేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్టుగా తెలిపారు.

## భగ్గుమన్న విభేధాలు

(మొదటిపేజీ తరువాయి)

కుమారుడు ఎంపీగా ఉన్నంత మాత్రాన తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఎందుకు ఇవ్వకూడదు?" అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ పార్టీని బలోపేతం చేయడానికి మహమూద్ అలీకి ఎమ్మెల్సీ పదవితో పాటు ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి పదవులు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే నాయిని నర్సింహారెడ్డికి కూడా ఎమ్మెల్సీ పదవితో హోంమంత్రి పొందారన్నారు. ఈయక పార్టీ అధిష్టానం త్వరలోనే అభ్యర్థిపై తుది నిర్ణయం తీసుకోనుందని సమాచారం. అయితే జూబ్లీహిల్స్ టికెట్ రేసులో ప్రధానంగా అంజన్ కుమార్ యాదవ్ తో పాటు.. నవీన్ యాదవ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఉన్నారు. మాజీ మంత్రి కంజర్ల లక్ష్మీనారాయణ కోడలు అయిన కంజర్ల విజయలక్ష్మి కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ మహిళా అభ్యర్థికి టికెట్ ఇవ్వడంతో.. కాంగ్రెస్ కూడా మహిళా అభ్యర్థికే అవకాశం ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.

## ఏఐలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్ తాళ్లూరి పల్లవి

**పల్లవి విజయం- గ్రామానికి గర్వం, దేశానికి గౌరవం**

ఖమ్మం రూరల్ మండలం అరెంపుల గ్రామం నుంచి జాతీయ వేదిక దాకా పల్లవి ప్రతిభ ప్రయాణం స్ఫూర్తిదాయకమని టెక్నాలజీ పట్ల మక్కువతో,కృషి మరియు కట్టుదిట్టమైన పట్టుదలతో (ఏఐపిఏ) విభాగంలో దేశవ్యాప్తంగా మొదటి స్థానాన్ని సాధించిందని చిన్నతనం నుంచే పట్టుదలతో చురుకుగా ముందు ఉండేదని తల్లిదండ్రులు తాళ్లూరి రవి ప్రసాద్,అజితలది సాధారణ మధ్యతరగతి కుటుంబం, తండ్రి ఎలక్ట్రిషన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు,విరికి ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె ఎంబీఏ,రెండవ కూతురు పల్లవి ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ కిట్స్ కాలేజీ ఇంజనీరింగ్ పూర్తి చేసి, ప్రస్తుతం హైదరాబాద్ లోని నేషనల్ స్కిల్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో ట్రైనింగ్ చేస్తుందని,పల్లవి సాధించిన ఈ విజయం కుటుంబానిదే కాదు, ఖమ్మం జిల్లాకి,అరెంపుల గ్రామానికి, గర్వ కారణం మని తల్లి తండ్రులు ఆనందం వ్యక్తం చేశారు

**మంత్రి పొంగులేటి అభినందన**

పాలేరు నియోజకవర్గంలోని ఆరెంపుల గ్రామానికి చెందిన పల్లవి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం గర్వకారణమని.ఇది యువతకు ప్రేరణ కలిగించే ఘనత అని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.తాళ్లూరి పల్లవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్ గా నిలిచి ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమారోహ్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా శనివారం జాతీయ అవార్డును స్వీకరించిన సందర్భంగా విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి ఓ ప్రకటనలో పల్లవితో పాటు ఆమె తల్లిదండ్రులు తాళ్లూరి రవిప్రసాద్, అజితలను అభినందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## సీఎం పిఆర్ఓని కలిసిన మాజీ కౌన్సిలర్



**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ లో పి.ఆర్.ఓ మల్సూర్ ని మర్యాదపూర్వకంగా కలువడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.మల్సూర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా మల్సూర్ ను అభినందించి, పార్టీ కార్యకలాపాలు ప్రజా సేవలో ఆయన భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ గంట లక్ష్మారెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీజేపీ ఫోకస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక త్వరలో జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే భారతీయ జనతా పార్టీ కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై దృష్టి సారించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి విజయం సాధించిన బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ మరణించడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు తమ పార్టీ అభ్యర్థిగా దివంగత మాగంటి గోపినాథ్ సతీమణి సునీత పేరును సైతం బీఆర్ఎస్ అధిష్టానం ప్రకటించింది. దీంతో సునీత పార్టీ నాయకులతో కలిసి నియోజకవర్గంలో గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో... జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చూడుతుంది. అంతేకాకుండా మంత్రులు, కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం జూబ్లీహిల్స్ నియోజకర్గ ఉప ఎన్నికపై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పార్టీ అభ్యర్థి ఎవరనేది అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని... అయితే నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.



అయితే తాజాగా బీజేపీ కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఫోకస్ చేసింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికకు అభ్యర్థిని ఎంపిక చేయడానికి అభిప్రాయాలను సేకరించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో మాజీ ఎమ్మెల్యే ఎం ధర్మారావు, మాజీ ఎంపీ పోతగంటి రాములు, కోమల ఆంజనేయులు ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి అభ్యర్థి విషయంలో పార్టీ నాయకుల అభిప్రాయాలను ఈ కమిటీ సేకరించనుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించలేదు. అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పాటు షెడ్యూల్ విడుదల చేయబడుతుందని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థి ఎంపికపై దృష్టి సారించినట్టుగా తెలుస్తోంది. బీజేపీ నుంచి చాలా మంది టికెట్ రేసులో ఉన్నారు. అయినప్పటికీ ప్రధానంగా గతంలో పోటీ చేసిన దీపక్ రెడ్డి, కీర్తి రెడ్డి, ఆకుల విజయ, కిలారి మనోహర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అనేకమంది పేర్లు వినిపిస్తున్నా టికెట్ ఇచ్చేది ఒకరికే కాబట్టి ఆ టికెట్ ఎవరికి ఇస్తే బాగుంటుంది, ఎవరిని అభ్యర్థిగా ఎంపిక చేస్తే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ గెలుపు సాధించే అవకాశం ఉంటుంది అనేదానిపై కసరత్తు చేసి అభ్యర్థిని ఎంపిక చేయనుంది త్రిసభ్య కమిటీ. క్షేత్రస్థాయిలో ఇప్పటికే కార్యకర్తలు పని చేస్తున్నారు. బూత్ వెరిఫికేషన్, ఓట్ వెరిఫికేషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పార్టీ అభ్యర్థి ఎవరైతే బాగుంటుంది, అభ్యర్థిగా ఎవరుంటే పార్టీ గెలిచే అవకాశం ఉంటుంది అనే అంశాలపై క్షేత్రస్థాయిలో పని చేస్తున్న వారి అభిప్రాయాలు తీసుకోవడం, రాష్ట్రంలోని ముఖ్య నేతల అభిప్రాయాలు తీసుకోవడం, నియోజకవర్గంలోని కీలక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించి మూడు పేర్లను రాష్ట్ర నాయకత్వానికి కమిటీ సూచించనుంది. రాష్ట్ర నాయకత్వం ఆ మూడు పేర్లను జాతీయ నాయకత్వానికి పంపుతుంది. ఆ తర్వాత తుది పేరును జాతీయ నాయకత్వం పంపించడం జరుగుతుంది.

## ఎన్నికలలో లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పోటీ

**సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య**




**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసివచ్చే లౌకిక ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి పోటీ చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య తెలిపారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం శంషాబాద్ పట్టణంలోని విస్తా హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో పల్నాటి యాదయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... రాబోయే జెడ్పిటిసి ఎంపిటిసి సర్పంచి ఎన్నికలలో కలిసివచ్చే ప్రజాస్వామ్య లౌకిక పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేయాలని మతతత్వ శక్తులను ఓడించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామాలలో సిపిఐ కార్యకర్తలు ప్రజా సమస్యల మీద పోరాడుతూనే ప్రజలకు చేరువ కావాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో మత తత్వ రాజకీయ పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించే ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కాపాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు పానుగంటి పర్వతాలు కే రామస్వామి ఓరుగంటి యాదయ్య బుద్ధుల జంగయ్య టి రామకృష్ణ ఎండి పై మీద జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం శ్రీను వడ్ల సత్యనారాయణ ఎం ఏ రియాజ్ ఆర్ యాదగిరి నీలమ్మ మండల కార్యదర్శులు భారతరాజు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ఆర్ కోసం రూ.45 వేల కోట్లు

- తెలంగాణ రీజినల్ రింగ్ రోడ్డు
- రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి
- జనవరిలో పనులు ప్రారంభం
- ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక
- బిఆర్ఎస్ భూ సేకరణ చేయలేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని తెలంగాణ రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. శనివారం నాడు మంత్రి చిట్యాల లో మీడియాతో మాట్లాడారు.. 2017 18 లో ప్రధాని మోదీ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డు కు అంగీకరిస్తే..బిఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయకుండా నిర్లక్ష్యం వహించిందని మంత్రి కోమటి రెడ్డి నాటి కేసీఆర్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు.

**భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6లేన్లు...**

తాను ఎంపీగా ఉన్నపుడు రైతులకు అన్యాయం జరగకుండా ధర్నాలో పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మంత్రి అయిన తర్వాత మార్కెట్ రేట్ ఇప్పించి రైతులను ఒప్పించానని అన్నారు. తాను మంత్రిగా అయిన కొత్తలో 6శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98శాతం పైగా పూర్తి చేసామని చెప్పారు. 4లేన్ల ఆర్ఆర్ఆర్ 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6లేన్లుగా



మార్చుకున్నామని తెలిపారు.

**సంగారెడ్డి నుండి చౌటుప్పల్ వరకు161.518కిలో మీటర్ల నార్త్ పార్ట్...**

సంగారెడ్డి నుండి నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవపూర్ వయా భువనగిరి, చౌటుప్పల్ వరకు 161.518కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందని అన్నారు. భూసేకరణ కోసం 6వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని కేంద్రం,రాష్ట్రం చెరిసగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 3వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామని అన్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని,ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం అయ్యామని పనులు వేగం చేసేలా మాట్లాడామని చెప్పారు. ఉత్తర భాగం అలైన్మెంట్ లో ఎలాంటి మార్పు ఉండదని,జనవరిలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. అందుకు కేంద్రం సహకరించాలని కోరారు.

**దక్షిణ భాగం రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఆందోళన వద్దు...**

దక్షిణ భాగం విషయంలో రైతుల అనవసర ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా కల్పించారు.

### ఆర్ఆర్ఆర్ కోసం రూ.45 వేల కోట్లు

రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ, నిర్మాణం కోసం 45వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కట్టిన, ఇప్పుడు లక్షన్నర కోట్ల విలువ గల ఓఆర్ఆర్‌ను 7వేల కోట్లకు అమ్ముకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని,చరిత్రలో రోడ్లను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్ ది మాత్రమేనని దుయ్యబట్టారు. రోడ్లు అమ్ముకున్న వాళ్లే.. అబద్ధపు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారనీ, వాళ్ల ట్రాప్ లో పడొద్దని రైతులను కోరారు. వాళ్ళు ఒక్క ఇల్లు కట్టలే,రేషన్ కార్డు ఇయ్యలే, సన్న బియ్యం ఇయ్యలే, ఇంటికి ఉచిత కరెంట్ ఇయ్యలే కానీ లక్షల కోట్లు అప్పులు మాత్రం చేసారని ఎద్దేవా చేశారు.

నితిన్ గడ్కరీ వ్యక్తిగతంగా తనను ఇష్టపడే వ్యక్తని తన పేరు చెప్పి గౌరెల్లి భద్రాచలం హైవే,ఎల్బీనగర్ మల్కాపురం రోడ్డు జీవో ఇచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ విజయవాడ హైవే 8లేన్ల నిర్మాణ పనులు వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభం అవుతాయని మరోమారు స్పష్టం చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదనీ, రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. అలైన్మెంట్ విషయంలో పెద్ద వాళ్ళకు ఒక న్యాయం, పేద వాళ్లకు ఒక న్యాయం ఉండదన్నారు మంత్రి కోమటి రెడ్డి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆర్ అండ్ బి మినిస్టర్ అయిన తాను రైతుల అంగీకారం తోనే ముందుకు పోతామని తేల్చిచెప్పారు. "నేను రైతు బిడ్డను..రైతుకు అన్యాయం జరిగితే ఊరుకుంటానా" అంటూ త్వరలోనే ముఖ్యమంత్రి తో మాట్లాడి మంత్రుల కమిటీ వేస్తామని తనను కలిసిన రైతులకు హామీ ఇచ్చారు.

## పోరాడుతాం

(మొదటిపేజీ తరువాయి)

ఇంకా సాగుతోందన్నారు. లేదంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. వందేళ్ల ముందు చూపు కేసీఆర్ ది అయితే, మంద బుద్ధి కాంగ్రెస్ పార్టీదన్నారు. రెండేళ్లుగా టిమ్స్ ఆసుపత్రులను పడావు పెట్టారని.. కేసీఆర్ మీద కక్షతో ఆసుపత్రులపై పగ పెంచుకోవడం దారుణమన్నారు. కరోనా తర్వాత వందేళ్ల ముందు చూపుతో హైద్రాబాద్ చుట్టూ నలువైపులా నాలుగు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించాలని కేసీఆర్ తలపెట్టారని.. టిమ్స్ లతో పాటు, నిమ్స్ రెండు వేల పడకల ఆసుపత్రి నిర్మించాలని శంకుస్థాపన చేశారన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు పని చేసినా నిజాం కాలంలో కట్టిన గాంధీ, ఉస్మానియా, కింగ్ కోఠి ఆసుపత్రులే ఉన్నాయని.. అందుకే పనులు ప్రారంభించిన కేసీఆర్ దాదాపుగా పూర్తి చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు ముందుకు పోవడం లేదు.. భూసేకరణ, టెండర్లు, డిజైన్లు పూర్తి చేసింది, నిధులు ఇచ్చింది... సెల్లార్ తో కలుపుకొని 6 అంతస్తుల భవనం ఎల్బీ నగర్ టిమ్స్ పనులను బిఆర్ఎస్ పూర్తి చేసింది. కానీ అప్పటి నుండి రెండేళ్లలో 5 అంతస్తులు మాత్రమే పూర్తి చేశారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉండి ఉంటే ఆసుపత్రి పనులు ప్రారంభమై, ప్రజలకు సేవలు అందించేదన్నారు. మేము మహేశ్వరం నియోజకవర్గంలో రంగారెడ్డి జిల్లా మెడికల్ కాలేజీ శాంక్షన్ చేస్తే, జీవో జారీ చేస్తే, దాన్ని రద్దు చేసారు. శంకుస్థాపన చేసిన కాలేజీని రద్దు చేసి, టిమ్స్ ఎల్బీ నగర్ లో విలీనం చేశారన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, హైదరాబాద్ టిమ్స్ ఆసుపత్రులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానలను ఆపేశారు. జూబ్లీహిల్స్ ప్రజలకు ఏం చెబుతారని సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు, బతుకమ్మ చీరెలు ఆపేశారు.. కేసీఆర్ ప్రారంభించిన పథకాలను ఆపడం తప్ప, మీరు చేస్తున్నదేంలేదన్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల వచ్చే సరికి హరీష్ రావు కు సమస్యలు గుర్తుకు వచ్చాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. నగర ప్రజలను పక్కదారి పట్టించడానికి ఆయన హడావిడి మొదలు పెట్టాడని మండిపడ్డారు. కొత్త పేట టిమ్స్ హాస్పిటల్ దగ్గర హరీష్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు షో చేశారని.. హాస్పిటల్ నిర్మాణం జరగడం లేదని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.. పదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రులను ఎందుకు నిర్మించలేదో హరీష్ రావు సమాధానం చెప్పాలన్నారు. అధికారం పోవడానికి యేడాది ముందు టిమ్స్ హాస్పిటల్స్ కు టెండర్లు పిలిచారు.. మా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వీటిని నిర్మాణంపైన ప్రత్యేక ధ్రుష్టి సారించారు.. అన్ని ఆస్పత్రుల నిర్మాణం దాదాపుగా 90 శాతం పూర్తైందన్నారు. సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ హంగులతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలు,ఆధునిక ఆపరేషన్ థియేటర్లను నిర్మిస్తున్నామని.. విదేశాల నుంచి వైద్య పరికరాలు రావాల్సి ఉండటం వల్ల ప్రారంభోత్సవానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. పేరు కోసం ఆదరాబాదరా గా ఆస్పత్రులను ప్రారంభించాలనుకోవడం లేదని.. ఉస్మానియా ఆస్పత్రి వరదల్లో మునిగి పోయినా కనీసం పట్టించుకోలేదు... మా ముఖ్యమంత్రి గోషా మహల్ అత్యాధునిక సౌకర్యాలతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.. కాంట్రాక్టు సంస్థ ఇప్పటికే నిర్మాణ పనులు మొదలు పెట్టిందని గుర్తు చేశారు. ప్రభుత్వాస్పత్రులను పదేళ్ల పాటు గాలికి వదిలేసి ఇప్పుడు హరీష్ రావు మాకు పాఠాలు చెపుతున్నాడని హరీష్ రావు,కేటీఆర్ ఎన్ని కుప్పి గంతులు వేసినా జూబ్లీహిల్స్ ప్రజలు పట్టించుకోరని ఆది శ్రీనివాస్ అన్నారు.

## కొలువుల జాతర

(మొదటిపేజీ తరువాయి)

వరుసగా విడుదల చేసేందుకు కసరత్తు కొనసాగుతోంది. తెలంగాణ ప్రభుత్వం పలు శాఖల్లో ఖాళీల భర్తీకి నిర్ణయించింది. ఉద్యోగ ప్రకటనలకు కీలకమైన ఎస్సీ వర్గీకరణ పూర్తికావడం, పెండింగ్ నియామకాలన్నీ ముగియడంతో సంబంధిత విభాగాలు వర్గీకరణ రోస్టర్ ప్రకారం ఉద్యోగ ఖాళీలు గుర్తిస్తున్నాయి. టీజీపీఎస్సీ గురుకుల, పోలీస్ నియామక బోర్డులు కొత్త ఉద్యోగాల భర్తీకి వీలుగా సంబంధిత విభాగాల నుంచి ప్రతిపాదనలు తీసుకునేందుకు అవసరమైన పరిపాలన ప్రక్రియను ప్రారంభించాయి. ఉద్యోగ క్యాలెండర్‌ను రూపొందించి, ఆ మేరకు నోటిఫికేషన్ల కోసం అవసరమైన ఆర్థికశాఖ అనుమతులు పొందేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీల గుర్తింపు, ఉద్యోగుల సర్దుబాటు, ఇప్పటికే ఆర్థికశాఖ అనుమతి పొందిన పోస్టులపై ప్రభుత్వం నియమించిన కమిటీ పరిశీలిస్తోంది. కాగా, ఈ పరిశీలనలో పోలీస్, వైద్య, విద్యుత్, టీజీపీఎస్సీ నియామకాలు ఉన్నాయి. ఇటీవల నియామకాలు పూర్తైన వాటిలో బ్యాక్‌లాగ్ ఖాళీలు దాదాపు 4,000కు పైగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒక్క




గురుకుల నియామక బోర్డు పరిధిలోనే దాదాపు 2 వేల వరకు ఉంటాయని అంచనా. గ్రూప్4లోనూ కొన్ని ఖాళీగా ఉన్నాయి. తాజాగా 20,000 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చింది. జాబ్‌క్యాలెండర్‌లో పేర్కొన్న కేటగిరీలవారీగా గ్రూప్స్, ఉపాధ్యాయ, పోలీస్, విద్యుత్, గురుకుల, వైద్య నియామకాలు చేపట్టేందుకు పరిపాలన ప్రక్రియ చేపట్టింది. ప్రభుత్వ విభాగాలు, విద్యుత్ సంస్థల్లోని ఇంజినీరింగ్ విభాగాల్లోనూ 2,000 నుంచి 3,000 వరకు ఖాళీలున్నట్లు సమాచారం. అధిక పోస్టులు పోలీస్ విభాగంలో ఉన్నట్లు తెలిసింది. ఎస్సై, కానిస్టేబుల్ స్థాయిలో 12,452 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. సివిల్ విభాగంలో అత్యధికంగా 8,442 పోస్టులున్నాయి. దీంతో.. ఇప్పుడు వీటి భర్తీ దిశగా త్వరలోనే అధికారిక ప్రకటన విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



## ఘనంగ అలయ్ బలయ్

**సికింద్రాబాద్, విశాలభారతి:**

నామాలగుండులోని గంగపుత్ర వెల్ఫేర్ సొసైటీ శనివారం అలాయ్‌బలాయ్ కార్యక్రమం ఘనంగ జరిగింది. గంగపుత్ర సోదరులందరూ పాల్గొని దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పాక గాలేష్ ,జనరల్ సెక్రెటరీ డాక్టర్ సందిరి రవీందర్, ఎర్రబోయిన మల్లేష్, కట్కూరి అశోక్ ,లింగం ,చంద్రగిరి ఎల్లయ్య, శ్రీకాంత్ ,మల్లికార్జున్ యూత్ అధ్యక్షుడు నగరపు శ్యామ్, గంగపుత్ర సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బండారి నర్సమ్మ కుటుంబానికి పరామర్శ

**దేవరుప్పల, విశాలభారతి :**

మండలం కడవెండి గ్రామానికి చెందిన బండారి సత్తయ్య ప్రభాకర్ మాతృమూర్తి నర్సమ్మ "90 సం"లు మృతి చెందగా, వారి ఇంటి వద్దకు వెళ్లి వారి మృతదేహానికి పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు తాటిపల్లి మహేష్ బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## మద్యానికి డబ్బులు ఇవ్వలేదని
# తల్లిని హతమార్చిన తనయుడు

- రంగారెడ్డి జిల్లా మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
- మద్యానికి బానిస అయిన కుమారుడు



ఇబ్రహీంపట్నం, విశాలభారతి: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వడం లేదని తల్లిని హత్య చేసిన ఘటన మంచాల మండలంలో కలకలం రేపింది. నవమాసాలు మోసి కన్న తల్లిని జీవితాంతం జాగ్రత్తగా చూసుకోవాల్సిం దిపోయి.ఓ కసాయి కొడుకు, కన్న తల్లినే కడతేర్చాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన మానిపాటి ఐలమ్మ సోమయ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఒక కూతురు ఉండగా, వీరి ముగ్గురి పెళ్ళిళ్లు అయ్యాయి. తల్లి ఐలమ్మ, తమ కులవృత్తి గంపలు అల్లికలు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆమె పెద్ద కుమారుడు శ్రీకాంత్ (34) కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గత కొంతకాలంగా మధ్యానికి బానిసైన శ్రీకాంత్ డబ్బు కోసం తల్లితో తరచూ గొడవపడే వాడని, డబ్బులు ఇవ్వకపోవడంతో కిరాతకుడిగా మరిన కొడుకు, తల్లిని ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. దీంతో రక్తపు మడుగులో పడిఉన్న ఐలమ్మను గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పలయ్య
# గెలుపు ఖాయం

- కొత్తూరు జి కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థిగా బట్టు ఉప్పలయ్య
- ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న నాయకుడు
- కాంగ్రెస్ పతాకం కింద ఏకమవుతున్న కొత్తూరు జి

**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని కొత్తూరు జి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చైతన్యం కొత్త ఊపిరి పీల్చుకుంది. గ్రామంలో గురువారం జరిగిన కాంగ్రెస్ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, మహిళా సంఘాలు, యువకులు అందరూ జెండాలతో, నినాదాలతో హాజరయ్యారు. ఈ సమావేశంలో కొత్తూరు జి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు ఉప్పలయ్య ని పార్టీ తరఫున ఎంపీటీసీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎంపిక చేయడం చరిత్రాత్మకంగా మారింది. సభలో సీనియర్ నాయకుడు పొన్నబోయిన వెంకటనారాయణ మాట్లాడుతూ "ఉప్పలయ్య కేవలం పార్టీకి మాత్రమే కాక, ప్రజల మనసుల్లో చోటు దక్కించుకున్న సేవామూర్తి. ఆయనకు ఈ అభ్యర్థిత్వం దక్కడం గ్రామానికి గౌరవం" అన్నారు. మాజీ సర్పంచ్ లూనావత్ పున్నం నాయక్ మాట్లాడుతూ "గ్రామంలో రోడ్లు, చెరువులు, విద్యుత్, పథకాలు ప్రతీ విషయంలో ఉప్పలయ్య ముందుండి పని చేశారు" అన్నారు. ఉమ్మడి కొత్తూరు (జి) లో ఉన్న ప్రతి గ్రామపంచాయతీని అభివృద్ధి దిశగా నడిపించడం నా కర్తవ్యం" అని తెలిపారు. యువ కాంగ్రెస్ కార్యకర్తలు పూలదండలతో ఘన సన్మానం చేయగా, గ్రామమంతా "హస్తమే అభివృద్ధి దారి" అంటూ నినాదాలతో మార్మోగింది.కార్యక్రమంలో కొత్తూరు జి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కట్ల జనార్ధన్, యూత్ అధ్యక్షులు నవీన్, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల వెంకన్న, రామారావు, కృష్ణ, యాకయ్య, నాగేశ్వరరావు, విశ్వనాథం, నరసయ్య, యాకాచారి, వెంపటి శ్రీను, మాలోత్ రవి, వాంకుడోత్ నాగేష్, వీరన్న, బక్క్య, వెంకన్న, లక్షిరామ్, నాగేశ్వరరావు, యాదగిరి, మల్లేష్, దేవ్ సింగ్ భాస్, భాస్కర్, మల్లేశం, మదర్, చిన్నమల్లు, సేటియా, మోహన్, శివ కుమార్, వేణుగోపాల్, గిరి, అరవింద్, నాగేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా
# దుర్గామాత శోభయాత్ర

**పాల్గొన్న మాజీ కౌన్సిలర్ సంధగళ్ళ విజయ సతీష్ గౌడ్**



చౌటుప్పల్, విశాలభారతి: పట్టణ కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర కాలనీ పార్కు స్థలంలో శ్రీ కనక దుర్గా మాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతిష్టించిన శ్రీ దుర్గామాత అమ్మవారు నవ రాత్రులు పూజలు అందుకున్న అమ్మవారి చీరాలను వేలపాట నిర్వహించి తదనంతరం కంఠమహేశ్వర కాలనిలో అమ్మవారిని ఊరేగింపు గా అంగరంగ వైభవంగా శోభ యాత్ర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 14వ వార్డు మాజీ కౌన్సిలర్ సందగళ్ల విజయ సతీష్ గౌడ్,శ్రీరామ్ యువసేన అధ్యక్షులు కిన్నె రవి,అయితగోని వినయ్ గౌడ్,కాంటాల శివాజీ,కడమంచి శ్రీకాంత్,సతీష్,రాంబాబు, రాంప్రసాద్,పవన్,చెందు,హర్ష,మహేష్,వంశీ, యశ్వంత్,అరవింద్,నర్సింహ,మణికంఠ,అభి, సన్నీ మహిళలు మరియు కాలానివాసులు పాల్గొన్నారు.

# 8 కిలోల గంజాయి పట్టివేత

**యాచారం పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు**



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

అనుమానస్పదంగా బ్యాగులతో తిరుగుతున్న ఇద్దరు యువకులను రంగారెడ్డి జిల్లా యాచారం పోలీసులు గమనించి వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 8 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మధు, తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని గున్గల్, బస్ స్టాప్ వద్ద సాగర్ రహదారిపై పోలీసులు గస్తీ నిర్వహిస్తూ ఉండగా ఒడిశా రాష్ట్రం, మల్కాంగిరి, జిల్లాకు చెందిన బలరామ్ కోబాసి, (21) ఉంగా పదయామీ, (21) ఇద్దరు యువకులు ఈజీ మనీకి అలవాటు పడి తమ గ్రామంలో అటవీ ప్రాంతంలో గంజాయిని సాగు చేసి దాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అందులో భాగంగా హైదరాబాద్ కు నీరజ్ కుమార్ యాదవ్, కు 80 వేలకు 8 కిలోల 400 గ్రాములను విక్రయించేందుకు ఒప్పందం చేసుకొని అతనికి ఇచ్చేందుకు వెళుతూ ఉండగా అనుమానస్పదంగా కనిపించడంతో పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న 8 కిలోలకు పైగా గంజాయి రెండు బ్యాగులను మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తం కోసం అబ్దుల్లాపూర్ మెట్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు ఉత్సాహం నింపారు.సమావేశంలో మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు ప్రతి గ్రామస్థాయిలో కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు భుజం తట్టుకుని పనిచేయాలని నేతలు సూచించారు.ఈ సందర్భంగా మండలంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, గ్రామ గ్రామానికి కాంగ్రెస్ పార్టీ కార్యాచరణను విస్తరించాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది.ఈ కార్యక్రమం లో అబ్దుల్లాపూర్ మెట్టు మాజీ ఎంపీపీ మహేందర్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర చారి, మండలంలోని మాజీ ఈసారి సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామాల స్థాయి ప్రముఖ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నేతలు

**దేవరుప్పల, విశాలభారతి:**

పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వడ్లకొండ తార,ఓయూ జేఏసి నేత ఇప్ప పృథ్వీరెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో మండలకేంద్రంలోని తిరుమల గార్డెన్ లో నిర్వహించిన సమావేశంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వీరితో పాటు దేవరుప్పుల మండలం,నీర్మాల గ్రామం నుండి నీర్మాల గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల రవీందర్ రెడ్డి,వడ్లకొండ ప్రశాంత్,తీరుపెల్లి కొండల్ రెడ్డి,ఎడ్ల శ్రీను,మెట్టు వింసెట్ రెడ్డి,బత్తిని మల్లేశ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి బిఆర్ఎస్ కండువాలు కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్,చింత రవి,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్,మాజీ జిసిసి చైర్మెన్ ధరావత్ గాంధీ నాయక్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్ నాయక్,మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య, కత్తుల సోమిరెడ్డి,మేకపోతుల నరసింహ, అన్నారపు యాదగిరి, దాస గాని బిక్షపతి, గడ్డం రాజు,మండల యూత్ అధ్యక్షుడు నవీన్, నాయక్, మండల సీనియర్ నాయకులు,మండల నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## భూముల పరిరక్షణ సమితి అధ్యక్షుడి నియామకం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**



తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడిగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం కా గజ్‌ఘాట్ గ్రామానికి చెందిన మచ్చ జంగయ్య శనివారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా మచ్చ జంగయ్య మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన తెలంగాణ భూముల పరిరక్షణ సమితి చైర్మన్ పల్లపు విజయ్, రాష్ట్ర అధ్యక్షుడు గోడుకొండ్ల ప్రవీణ్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మచ్చ జంగయ్య కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# నిమజ్జనానికి తరలిన అమ్మవారు



**సికింద్రాబాద్, విశాలభారతి:**

మాత నవరాత్రి ఉత్సవాలు పూర్తి చేసుకొని శనివారం నిమజ్జనానికి శనివారం బయలు దేరుతున్న దుర్గామాతల మండపాల వద్ద అమ్మవారి వాహనాలకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ పార్సిగుట్ట, న్యూ అశోక్ నగర్, సంజీవపురం లలో పూజలు చేసిన వాహనాలు నిమజ్జనానికి బయలుదేరడం సంతోషమని రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు నవరాత్రులు ని ష్టతో ఉపవాస దీక్ష పూజలుచేస్తూ నియమ నిబంధనలతో తొమ్మిది రోజులు భక్తితో వారి కోరికలు నెర వేరి సుఖ శాంతులతో అమ్మ వారు ఆశీస్సులతో ఉండాలని రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు ఈ కార్యక్రమం లో నాయకులు బాలకృష్ణగౌడ్, పురుషోత్తం, శేఖర్ చారి,డప్పు మల్లికార్జున్, ఉమాపతి, నవీన్, భాస్కర్ గౌడ్, విష్ణు, పాండు, ఓములు, శామ్ రాజ్,దీపక్, మార్టిన్, మోహన్ రావు తదితర బస్తి ప్రముఖులు పాల్గొన్నారు.

# సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

**జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి పిలుపు**

**చౌటుప్పల్, విశాలభారతి:**

జరగబోయే సర్పంచ్,ఎంపిటిసి,జెడ్పిటిసి ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రోజున కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు చౌటుప్పల సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శివర్గ సభ్యులుతడక మోహన్ అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రజాప్రతినిధులుగా సిపిఎం ప్రాతినిథ్యం వహించిన గ్రామాలలో, మండలాలలో ఎలాంటి అవినీతికి తావులేకుండా గ్రామాల,మండలాల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా పనిచేశారని అన్నారు. నిరంతరం గ్రామాల్లో ఉన్న రైతులు,వ్యవసాయ కూలీలు,వృత్తిదారులు,కార్మికుల పక్షాన వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలలో ముందుండి పని చేశారని తెలిపారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు డబ్బుకు,మద్యం,అమలుకాని హామీలకు మోసపోకుండా నిరంతరం ప్రజల సమస్యలే ఎజెండాగా పని చేస్తున్న సిపిఎం అభ్యర్థులను అదేవిధంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మండల కార్యదర్శి వర్గ సభ్యులు మండల కమిటీ సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు జిల్లా మండల ప్రజా సంఘాల నాయకులు శాఖ కార్యదర్శులు గ్రామ కమిటీ సభ్యులు మహిళలు డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రజలు సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. ఈ సమావేశానికి సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు జిల్లా కమిటీ సభ్యులు రాగిరికిష్టయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు చింతల సుదర్శన్,బోయ యాదయ్య మండల కమిటీ సభ్యులు అంతటి అశోకు,ఆదిమూలం నందీశ్వర్,పొట్ట శ్రీను,పల్లె మధు కృష్ణ,కొండే శ్రీశైలం,జక్కిడి దేవేందర్ రెడ్డి,చెరుకు లక్ష్మమ్మ నాయకులు కందాల రవీందర్ రెడ్డి,జక్కిడి రాంరెడ్డి,శాఖ కార్యదర్శులు కొంతం శ్రీనివాస్ రెడ్డి,కాసం వెంకటేశం,రత్నం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# హాస్పిటల్స్ పై దాడులను సహించము

**ఎస్సై గొల్లపూడి ఉపేందర్**

**తొర్రూరు, విశాలభారతి:**



హాస్పిటల్స్ పై దాడులు చేసే వారిపై కఠినంగా ఉంటామని ఎస్ఐ ఉపేందర్ అన్నారు. దసరా రోజున వెంకటాపురం గ్రామానికి చెందిన నలమాస ప్రశాంత్ బైక్ మీద నుండి పడి చికిత్స కోసం నిర్మల హాస్పిటల్ తొర్రూరు కి వెళ్లి, చికిత్స విషయంలో హాస్పిటల్ వారితో గొడవపడి, అతడి మిత్రులు అయిన నలమాస గణేష్,మొగుళ్ళ సంపత్ మరియు వంగ గణేష్ అను వ్యక్తులతో కలిసి నిర్మల హాస్పిటల్ పై దాడి చేసి, అక్కడ పనిచేసే డాక్టర్ చందుని, ఇతర సిబ్బందిని కొట్టి గాయపరిచి, హాస్పిటల్ లోనే మెడికల్ ఎక్విప్మెంట్ ఫర్నిచర్ ఇతరములను ధ్వంసం చేసినారు. ఇట్టి సంఘటనపై హాస్పటల్ సిబ్బంది అయినా ముత్తినేని నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శని వారం రోజు అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపించడం జరిగింది. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు,పున రావృతమైతే నాన్ బెలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ట్విట్టర్ పోస్టుకి స్పందించిన ఎమ్మెల్యే

**రాజేంద్రనగర్, విశాలభారతి:**



బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ 1 వ వార్డు సాయి వాల్మీకి నగర్ కాలనీవాసులు సమస్యలను ట్విట్టర్ వేదికగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి ట్యాగ్ చేయడం జరిగింది. విషయం తెలిసిన స్థానిక నాయకుడు హరీష్ గౌడ్ చొరవతో కాలనీవాసులు ఈరోజు ఎమ్మెల్యేని కలవడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కమిషనర్ కి ఫోన్ చేసి వీలైనంత త్వరగా వారి రోడ్డు సమస్యలు పరిష్కరించాలని తెలియజేయడం జరిగింది .ట్వీట్ చేసిన రెండు రోజుల్లోనే స్పందించి వారి సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది . అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామని తెలియజేస్తూ.. సమస్య తమ దృష్టికి సోషల్ మీడియా వేదిక ద్వారా వచ్చిన కూడా అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదు అని ,ఎమ్మెల్యే తెలియజేశారు . ఇదివరకే 100 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే తెలియజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు హరీష్ గౌడ్ ,కాలనీ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి, బాలాజీ, లోకేష్ ,రాజశేఖర్ గౌడ్, సూర్య ప్రకాష్, రాకేష్, అనిల్ ,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కి
# ప్రజలు బుద్ధి చెబుతారు




**ఎర్రబెల్లి దయాకర్ రావు**

**తొర్రూర్, విశాలభారతి:**

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ కి ప్రజలు బుద్ధి చెబుతారు అని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తొర్రూర్ మండలంలోని హరిపిరాల, వెలికట్టే గ్రామాలలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని కాంగ్రెస్ బాకీ కార్డు పత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ... త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తూ గత 22 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపిస్తూ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరుగుతూ కాంగ్రెస్ బాకీ కార్డు చూపుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని తెలియపరుస్తూ బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ తోనే ప్రజా సంక్షేమం ఉంటుందని తెలుపాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను నెరవేర్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లను అడగాలని అన్నారు. సాధ్యం కానీ 42 శాతం రిజర్వేషన్లు ప్రజల ముందుకు తీసుకువచ్చి ప్రజల్ని అయోమయానికి గురి చేస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు,మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నల్లమాస ప్రమోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో సీసీ కెమెరాల యూనిట్ చోరీ

**చిక్కినట్టే చిక్కి దొంగ పరార్**

**ఉప్పల్, విశాలభారతి:**

శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ తాళం లోపల నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి టీవీ తో సహా సీసీ కెమెరాల యూనిట్ చేతిలో పట్టుకుని బయటికి వస్తుండగా రాజు అనే ఒక పత్రిక రిపోర్టర్ గమనించి అడ్డుకోవడంతో.. ప్రెస్ క్లబ్ ముందు సీసి కెమెరాలు పరిశీలించేందుకు డివిఆర్ మిషను పోలీసులే తీసుకురమ్మంటున్నారు అంటూ ఆ దొంగ బుకాయించి పరుగు పరుగున పోలీస్ స్టేషన్ వైపు వెళ్ళాడు. దీంతో ఆ రిపోర్టర్ కూడా వెంబడించి పోలీస్ స్టేషన్ వరకు చేరుకున్నారు. అక్కడ ఏ పోలీసులు నిన్ను మిషన్ తెమ్మంటున్నారు అంటూ ప్రశ్నించడంతో సదరుదొంగ పోలీస్ పేరు చెప్పే ప్రయత్నం చేశాడు. ఆ పోలీసు ఎక్కడున్నాడని రిపోర్టర్ ఫోన్ చేస్తున్న ప్రయత్నంలోనే సదరు దొంగ అక్కడ నుంచి కూడాయించాడు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ లో మాత్రం సీసీ కెమెరాల యూనిట్ ను దొంగిలించుకుపోయాడు. అదే సమయంలో అక్కడ కు చేరుకున్న ఉప్పల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ సీసీ కెమెరాలు పరిశీలించి కేసు నమోదు చేయాల్సిందిగా ఎస్ఐ ని ఆదేశించారు. చోరీకి పాల పడ్డది పాత నేరస్తుడు అయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

